# తెలుగువారు మంచివారు! ఆవేదనను సహితమూ ఆహ్లాదంగా భరించారు. పశువైద్య విశ్వవిద్యాలయ ప్రాంగణమంతా ఓ అడవి! సీతమ్మ వారిలా పాదయాత్రలు చేసాం!



కారడవీ కాదు, కార్లు నడిచే అడవీ కాదు. ఎండ మండింది. చినుకు చినుకు జల్లులతో... చిటపట చిరు సవ్వడితో... వానజడి ఆడింది వయ్యారంగా...! అంటూ ప్రకృతి పరమళించింది. ప్రపంచ తెలుగు మహాసభల్లో కళాకారుల గజ్జల సవ్వడికి భూమి పులకిస్తే... కళామతల్లి ముద్దుబిడ్డల ప్రదర్శనలకు వినీలాకాశం ద్రవించింది. ఆదరించేందుకు వచ్చిన తెలుగు భాషాభిమానులకు సైతం చిరుజల్లులతో ఆకాశం నుంచీ ధారాపాతంగా వర్షం కురిసింది. ముసురుకున్న మబ్బులు, చల్లని పిల్ల గాలులు, చిటపటచినుకులతో ఆహ్లాదకర వాతావరణంలో తెలుగు మహాసభలు మూడు రోజులు ముచ్చటగా ముగిశాయి. గత మూడు రోజులుగా ఆడి, పాడి, చిందేసిన కళాకారులు... తమ కవితలతో సభికులను ఆకట్టుకున్న కవులు... ఇలా ఎందరో మహానుభావులు అందరూ తిరునగరిలో తెలుగు జాతరను జరిపారు. ఒక జ్ఞాపకంలా దాచుకొని వెనుదిరిగారు. తెలుగు భాషాభివృద్ధి మకుటుంతో జరిగిన త్రిదిన సభల్లో అతిథులు ఆహూతులు భోజనాలు అందకపోయినా, జనం విరగబడ్డారు. చివరిరోజున వీరి నిరాహారత పరిస్థితిని చూచి పుడమి తల్లి ప్రసవ వేదన పడింది. అది చూచిన ఆకాశం ధారధారలుగా వర్షం కురిపించింది.

నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభలు పల్లె ప్రాంతాల్లో ప్రతి ఏటా జరిగే తిరునాళ్లను తలపించాయి. ఈ ఉత్సవాలకు విద్యావంతులు, భాషాభిమానులు ప్రతినిధులుగా హాజరై రానున్న కాలంలో తెలుగు భాష వ్యాప్తికి జరగవలసిన వివిధ అంశాలను చర్చించగా, మరోవైపున ఈ ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుంచి ముఖ్యంగా చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. పాఠశాలల విద్యార్థులు, యువతీయువకులు, గ్రామీణ ప్రాంత వాసులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శనివారం ఉదయం ఒకవైపున మబ్బుతో చినుకులు పడుతున్నప్పటికీ, మహాసభల ప్రాంగణంలో జానపద కళావేదిక వద్ద గంగిరెద్దుల వారు తమ ప్రదర్శనలను ప్రారంభించి, సందర్శకులకు వినోదాన్ని అందించారు. సన్నాయి, డోలు, వాయిద్యాల సంగీతం మధ్య గంగిరెద్దుల ఆటలు అక్కడి సందర్శకులను గొప్పగా ఆకర్షించాయి. జానపద కళాకారులు తమ కోలాట ప్రదర్శనలు, లంబాడి నృత్య ప్రదర్శన కూడా వానలోనే నిల్చోవడం మరో విశేషం. జానపద, రంగస్థల కార్యక్రమాలను తిలకించడానికి ఏర్పాటుచేసిన ప్రాంగణాలు కిక్కిరిసాయి. ప్రదర్శనశాలల్లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసిన వ్యవసాయ ప్రదర్శనలు, తెలుగు సినిమాపై ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనలు, లేపాక్షి అపురూప వస్తువులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మూడున్నర దశాబ్దాల తరువాత ప్రారంభమైన ప్రపంచ తెలుగు మహాసభలు మూడు రోజులపాటు క్రిక్కిరిసిన, వేలాదిగా తరలివచ్చిన తెలుగువారు తెలుగు తల్లికి నీరాజనం పట్టారు. ఇసుకపోసినా క్రింద రాలనివిధంగా జనం వచ్చారు.

ఒకవైపు గంగిరెద్దుల ఆట, మరోవైపు 'కులుకుగ నడవరే కొమ్మలారా' అంటూ నృత్యం. ఒకచోట 'భరత ఖండంబు నా పాఠశాల' అనే పద్యగానం, మరోచోట తెలుగుని ఎలా బతికించాలనే చర్చ. వీటిని చూడడానికి, వినడానికి తండోపతండాలుగా జనం. వానలో తడుస్తూ ఎగబడుతున్న ప్రజల్ని చూచాక 'ఎండలో వత్తురు, వానలో వత్తురు' అన్నమయ్య పదం సత్యమైంది. చీరకట్టుతో, తలనిండా పూలతో అచ్చ తెలుగు అమ్మాయిల్లా ముస్తాబై వేలాదిమంది కాలేజీ విద్యార్థినులు వచ్చారు. అంతటా సందడి, పండుగ వాతావరణం. ముందస్తు ఊహించలేని ఎక్కువమంది రావడం ప్రతినిధులకు ఇబ్బందయింది. చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి వరదలా జనం వచ్చిపడ్డారు. దారి పొడవునా పులివేషాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు, పౌరాణిక పాత్రల వేషగాళ్లు కనిపించడంతో ప్రతినిధులు రాలేకపోయారు.

ఒకవిధంగా నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభల్లో 'ఎంత జనసందోహం' కేరింతలతో జరిగినవో అంతగాను అపశృతులు పలికాయ్. వేలాది మైళ్ళు, సాగరాలను దాటి ప్రతినిధులుగా ఆహ్వానితులుగా వచ్చిన వారెవ్వరికీ వసతి సౌకర్యం కలిపించలేకపోయారు. వారుగా వసతి గృహాల్లో తలదాచుకోవాలని ప్రయత్నిస్తే, కలెక్టర్‌గారు ఆ నాలుగు రోజుల పాటు, చిన్నా పెద్దా హోటళ్ళనన్నిటినీ తమ



దిగ్బంధనంలో పెట్టుకున్నారు. మలేషియా నుంచీ వచ్చినవారు, లండన్ యితర పాశ్చాత్య దేశాల్నుంచీ వచ్చినవారు ధర్నా చేస్తే, నూరూ నూట ఇరవై మందికి 20, 25 గదుల నిచ్చారు. ప్రతినిధులకు, వివరాలు తెలిపేవారే లేదు. వసతిని కూర్చేవారే లేదు. ఫోను తీయరు. అదవా తీస్తే మేమేమీ చేయలేము – మీకో నమస్కారం అంటారు. రాష్ట్రపతి ఈ సభల ప్రారంభానికి వచ్చి నందున, వేలాది పోలీసులూ, వందలాది అధి కారులూ, సమాచార శాఖల వారితో తిరుపతి నిండిపోయింది. ఆహ్వానితులు కొందరి కళ్ళకు ఆ ఉన్న రెండు కాళ్ళకూ సంకెళ్ళు వేసింది. ●



మహిళ వేషంలో నృత్యం చేస్తున్న కరీంనగర్ జిల్లా కళాకారుడు రత్నకుమార్





# ఆంధ్ర వాఙ్మయమెంతో అలతి అలతి పదాల శారదాంబ!

మొల్ల రామాయణంలో వర్ణనలు ఎన్నదగినవి. కృష్ణరాయలను కృష్ణునితో పోలుస్తూ, మొల్ల చెప్పిన పద్యాలు భాషావైభవానికి చేవ్రాలు

## అవధాన సుధతో పదాలు పారిజాతాలు

బహ్వ, గహ్వ, ప్రహ్వ, జిహ్వ పదాలిచ్చి అందమైన కందంలో అంబను స్తుతించమన్నాడో పృచ్ఛకుడు. అవధాని కావూరి పూర్ణచంద్రరావు కలుగజేసుకుని బహ్వఙ్ఝు హిమనెదిరిచి, గహ్వగ తింగుర్తి జగతి గాచిన దుర్గన్ ప్రహ్వంబగు నుదుపుల నా, జిహ్వయు నుతియించు నెల్ల చిత్తము లలరన్...' స్పందించారు. నిజానికి స్పందించినది ఆయన కాదు. ఏ పదాలయినా ఫరవాలేదని, మనకే సొంతమై, అవధానానికి అడ్డుండదని చెప్పింది ఆంధ్ర వాఙ్మయమే.

## ఎందరో మహానుభావులు

'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు' అచ్చ తెనుగు పదాలను ఆలపిస్తే వచ్చే మాధుర్యం వాగ్గేయకారుడు త్యాగరాజస్వామికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలుసు. ఇహ అన్నమయ్య 'నానాటి బదుకు నాటకము' అంటూ జీవితసత్యాన్ని విడమరిచి చెప్పగలగడం వాడుక భాషా మహత్యం. తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు, పుట్టనేమి వాడు గిట్టనేమి... వేమన పద్యాలు పండిత పామర రంజకాలు. అల్పకవిని ఎద్దనవలె మొద్దనవలె గెద్దనవలె కుందవరపు కవి చౌడప్పా అనేసి గమ్మున కూర్చున్నాడు చౌడప్పడు.

ఎక్కడనుండి రాక యిటకు, ఎల్లరున్ సుఖులే కదా... బావా ఎప్పుడు వచ్చితీవు... అయినను పోయిరావలయు హస్తినకున్... అంటూ పాండవోద్యోగ విజయాలు నాటకంలో కృష్ణుడు చెలరేగుతుంటే ఒకటే ఈ (గో)లలు. తిరుపతి వేంకటకవుల మెడలో పూల మాలలు. ఇప్పటికీ ఈ పద్యాలు వింటూంటే అంతరంగ మూలాలో ఏదో చెప్పలేని అందమైన అనుభూతి. 'చిలకమర్తి వారి గయోపాఖ్యానం' నాటకం కూడా ఊరూ వాడా మారుమోగిందే. 'వేమునకు పానకము పోసి పెంచినటుల... త్రాచుపామును పాలుపోసి కాచినటుల...' అర్జునుణ్ణి చూసి నల్లనయ్య తెల్లబోయిన ఘటన కల్పనలకే కల్పన. ఈ నాటకంలో 'మందాకినీనందన కుంభసంభవ రాధేయ ప్రముఖ వీరయోధ గర్వితమగు ధార్తరాష్ట్ర సైన్యము' అనే గద్యం బహుహృద్యం.

రుషి వంటి నన్నయ రెండవ వాల్మీకి. తిక్కన్న శిల్పమ్ము తెనుగు తోట. పోతన్న తెలుగుల పుణ్యపేటి. ఒక్కడు నాచన సోమన. ఇలా నాటి మేటి కవులందరికీ పేరు పేరునా నీరాజనాలు పట్టారు జ్ఞానపీఠ్ విజేత విశ్వనాథ సత్యనారాయణ. రామాయణ కల్పవృక్షం, కులమతాలు గీచుకొన్న గీతలచొచ్చి, పంజరాన కట్టుపడను నేను, నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు తరుగు లేదు విశ్వనరుడను నేను అనిన జాషువా, అలతి అలతి పదాలతో జయజయధ్వానాలు చేశాడు. ఆకులో ఆకునై పూవులో పూవునై కొమ్మలో కొమ్మనై నును లేత రెమ్మనై... కృష్ణశాస్త్రీయంగా నడిచిన కవిత్వం ఎంతటి కమనీయం. యెంకి వంటి పిల్ల లేదోయ్ లేదోయ్, మెళ్లో పూసలపేరు, తల్లో పూవుల సౌరు, కళ్లెత్తితే సాలు కనకాభిషేకాలు... నండూరి యెంకిని నాయుడుబావ వచ్చి వ్యవహారికంలో ప్రేమించేశాడు. నన్నెవ్వరాపరీవేళ... నాధాటి కోపలేరీ వేళ... బసవరాజు గేయాలు ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించాయి.

నేను సైతం ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను... ఎండకాలం మండినపుడు గబ్బిలం వలె కాగిపోయాడు శ్రీశ్రీ. అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ అన్నీ కవిత్వానికి సరకూ నపేవేనని తేల్చిపారేశాడు. నా కవిత్వం కాదొక తత్వం, మరికాదు మీరనే మనస్తత్వం... బాలగంగాధరుడు స్వచ్ఛమైన 'తిలక'పలుకులు పలికాడు. దేనికయినా నేరెడీ, పేరడీ అనే రుక్కాయి (రుక్మిణీనాథ శాస్త్రి) శ్రీరంగం నవకవితను గురించి చెబుతూ, మాగాయీ కందిపచ్చడీ సామానోయ్ సరదాపాటకు అనేశాడు.

## ఇహ గురజాడ, శ్రీపాదశాస్త్రి...

సాయంకాలమైంది. సంతలో సామాను కొనిపెడతానని నెలరోజుల కిందట ఇరవై రూపాయలు పట్టుకెళ్లి డాన్సింగ్ గర్లుకింద ఖర్చుపెట్టాను. విజయనగరం బొంకుల దిబ్బ మీద గిరీశం చేత నానారకాల బొంకులూ వాడుకభాషలోనే బొంకించాడు గురజాడ. ఎవరు వారు. కౌండ్రుశ్రౌతిని. అంతా కులాసానా, నీ ఆశీర్వచనబలంతో, నువ్వు క్షేమంగా వచ్చావా. జిర్రున చీద లేదురా... శ్రీపాద కథలో పాత్రలో మనతో మాట్లాడుతున్నట్టే ఉంటాయి. సుబ్బయ్య సుందరుడు కాడు. ఇది సుబ్బయ్య అభిప్రాయం. సుబ్బయ్యకి జమీందారీ లేదు. అది అతని భార్య సావిత్రికి కోపకారణం. సుబ్బయ్య నంగిరిపింగిరిగాడు. సావిత్రి అన్న వెంకటరావు ఈసడింపు.... రావిశాస్త్రీయం తెల్లని తెలుగున ముత్యాల స్వరకట్టలే! కట్టలు తెంచుకుంది. బుగతోడు గూడుబండి... వంగి పండు జానపదం వీరవిహారం చేసింది.


## చికిలింత చిగురు...

మింటచనే మేఘమునై, మేఘములోని చంచలనై. చంచల కోరే గురినై, నా గురిలో నేనే నటిస్తా... గుణసుందరుడిగా పింగళి వారు దట్టమైన తెనుగును వెండి తెరమీద విరగ్గాయించారు. చికిలింత చిగురు సంపంగి గుబురు చిన్నదాని మనసు, చిన్న దానిమీద మనసు... చిరంజీవులై నిలిచే పాటలను జనంమీదికి గుప్పించాడు మల్లాది. అది అనాదియు నీవే దేవా. నింగియు నేలయు నీవేగావా... భక్తప్రహ్లాదునికి దాశరథి భక్తితో వంత పాడాడు. పూలదండలో దారం దాగుందని తెలుసు పాలగుండెలో ఏది దాగుందో తెలుసునా... పదాలతో ఆత్రేయ ఆవేదనపడ్డాడు. తోటలో నారాజు తొంగి చూసెను నాడు... భాష రుణం తీర్చుకునే బాటపట్టాడు సినారె. ఆమని కోయిల ఇలా నా జీవన వేణువు లూదగా... సరాగాలకు పోయాడు వేటూరి.

## ఇహ నానీల


జారిపో జారిపో కన్నీటి చుక్క. మరో బిందువుకు చోటుండాలి కలదా... వివాహమా ఎంతపని చేశావు. నా పుట్టింటికే నన్ను అతిథిని చేశావు. నవ్య కవితారూపంగా నానీలు రంగప్రవేశం చేశాయి. గోపీ బాటలో కవులు జీవితసారాన్ని అక్షరబద్ధం చేస్తున్నారు. నావి, నీవి, వెరసి మనవి అయ్యాయి.

ఇలా చెప్పుకుంటూ వెడితే పైన పేర్కొన్నవారు కొందరే. ఆంధ్రాన్ని ఆధారంగా చేసుకుని సాహిత్యాన్ని విరబూయిస్తున్నవారు ఎందరో! వీరందరి అంతస్సూత్రం మటుకు తేనెతేటగా, తేటగీతిగా సాగే త్రిలింగదేశపు సారస్వతమే. అందుకే మన అచ్చులకి, హల్లులకి, గుణింతాలకి వీటిని కనిపెంచిన అనేకానేక ధాతువులకి వందనం. వందనమంటే మామూలు వందనం కాదు. "క్షోణితలంబు నున్నుదురు సోకగ" పోతన చెప్పినటువంటి పాదాభివందనం. ●



**దేశభక్తుల దీక్షబూని ఉడుకురక్తపు యువకుల్లారా, దేశం కోసం త్యాగం చేసిన ఈ అమర వీరులనొక్కమారైనా స్మరించండి. దేశ వినాశనానికి కారకమయ్యే సమ్మెలను నిరసించండి. అమాయకంగా ప్రాణాలను అహుతి కావించకండి. దేశ ఛిద్రానికి కారకులు కాకండి.**

# కర్తవ్యాన్ని బోధించడమే భగవద్గీత ముఖ్యోద్దేశం!



**క్లైబ్యం మాస్మగమః పార్ధనైతత్త్వయ్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోతిష్ట పదంతప ।**

– అర్జునా! పిరికితనంపాలు కావద్దు. వీరుని (నీకిది) ఉచితం కాదు, పరంతపా! తుచ్ఛమైన హృదయ దౌర్భల్యమును విడిచిపెట్టు. యుద్ధమునకు (ఇక్కడ యుక్తము అని చెప్పుకుందాం) నడుము కట్టుము' అన్నాడు కృష్ణ పరమాత్మ.

ఇదే విషయాన్ని స్వామి వివేకానందులు కూడా – యువకులారా! పిరికి తనమును వీడండి, వందమంది యువకులైనా నా ముందుకు రండి. మీ శక్తి సత్యమనే ధర్మంలోనే ఉన్నది. కర్తవ్య విముఖులు గాకండి అన్నారు స్వామి వివేకానందులు. ఆయన 'గీత'ను పూర్తిగా విశ్వసించారు.

కృష్ణపరమాత్మ ఎవరు చేయవలసిన పనులను వారు చేయాలి. నీవు నిమిత్త మాత్రుడవై! కర్మఫలమును నాకు వదలి వేయుము. ఈ యుద్ధమును చేయాలి. సక్షత్రియులు ఎప్పుడూ భీరువులు కారాదు! భీర వచనములను పలుకరాదు.



**శ్లో॥ అధచేత్త్వమియం ధర్మం**
**సంగ్రామంత నకరిష్యసి**
**తతస్వద్ధర్మం కీర్తించ**
**హిత్వాపాప మద్యాప్స్యసి ।**

– ధర్మయుతమైన ఈ యుద్ధమున నీవు చేయకుండినచో స్వధర్మమును, కీర్తిని పోగొట్టుకొనుటయే గాక పాపమును పొందుదువు.

**శ్లో॥ అకీర్తించాపి భూతాని కథయిష్యంతి తేవ్యయాం**
**సంభావితస్య చాకీర్తిః మరణాదరీతి రిచ్చతే ।**

– లోకులు నీయొక్క అసామర్థ్యతను శాశ్వతంగా చెప్పుకుంటారు. మాననీయునికి అపకీర్తి కన్నను మరణమే మేలని గ్రహించు.

**శ్లో॥ భయాద్రణా దుపరతం మస్యంతేన్తే త్వాం మహారధి**
**యేషాం చత్వం బహుమతోభూత్వా యాస్యసి లాఘవమ్ ।**

– ఇంతవరకూ నిన్నెల్లరు యోధులూ మహారధుడవని భావించినవారే నిన్ను చులకన చేయుదురు. నిన్ను యుద్ధభీతి కలవాడిగ, యుద్ధము చేయుటకు వైముఖ్యుడవైతివనుకుంటారు.

**శ్లో॥ అవ్యాచ్యవాదాంశ్చ బహూనదివ్యన్తి తవాహితాః**
**నిదంతస్తవ సామర్థ్యం తతోదుఃఖతరమేను కిమి ।**

– నీ శత్రువులు నీ సామర్థ్యమును నిందిస్తారు, నిన్ను అనరాని మాటల నెన్నో అంటారు. పరుష వాక్యములాడుతారు. ఇంతకు మించిన దుఃఖమేముంటుందయా!

**శ్లో॥ హతోవోప్రాప్స్యసే స్వర్గం జిత్వావా భోక్ష్యసే**
**తస్మాదుత్తిష్ట కౌంతేయా యుద్ధాహ కృతనిశ్చయః**

– అర్జునా ఒకవేళ యుద్ధమున చంపబడితిచో స్వర్గమును పొందెదవు, జయం పొందతివేని రాజ్యము ననుభవించుదువు. కావున నేను చెప్పినట్టు యుద్ధము సేయుటకు సంసిద్ధుడవు కమ్ము.

**శ్లో॥ సుఖదుఃఖేసమేకృత్వా లాభాలాభౌ**
**తతోయుద్ధాయ యుజ్యస్వ ణైవం పాపం మవాప్స్యస ।**

– అర్జునా, సుఖదుఃఖాలు, లాభనష్టాలు, జయాపజయాలను సమంగా భావించి యుద్ధమునద్యుక్తుడవు కమ్ము! అలా చేసిననాడు నిన్నే పాపము నంటదు అన్నాడు పార్థసారధియైన శ్రీకృష్ణుడు.

శ్రీకృష్ణపరమాత్మ అవతారపురుషుడు. ఆయనకు సర్వమూ విదితమే. చేసేదంతయూ ఆయనే! కానీ ఆ కీర్తిని తన భక్తులు పొందేట్లు చేస్తాడు. ఉత్సాహ పరుస్తాడు. వారి వీరశౌర్యాలకు కారకుడాయనైనా, భక్తజనవల్లభుడైన ఆయన ఆ కీర్తిని భక్తులకనుగ్రహిస్తాడు. దుష్టశిక్షణా, శిష్టరక్షణా ఆయన అనుగ్రహాలే. చైతన్యపరిచే సమయం, వచ్చింది. విజయనామ సంవత్సరం అవినీతిపరులను అధర్మ పరులనూ శిక్షించే కాలమనినా ఊహ! ●

## రాహుల్ కాశ్మీర్ రాకుమారునిలా వున్నావ్! నువ్వు నెం. 2 కాదు నెం.1 వే!




మీ ముత్తాత మోతీలాల్ నెహ్రూ కాశ్మీర్ మహారాజు వంటివాడు. మీ తాత జవహర్‌లాల్ నెహ్రూ తొలి భారత ప్రధాని. మీ నాయనమ్మ ఇందిరమ్మ కూడా! తొలి భారత మహిళా ప్రధాని. మీ తండ్రి రాజీవ్ తొలి యువ ప్రధాని. మీ తల్లి సోనియా ప్రధానికి మించిన ప్రధాని. మీరందరూ నెహ్రూలే నయ్యా. నీవు రాహుల్ నెహ్రూ యని పేరు పెట్టుకో! ఏ దృష్టీ తగలని ప్రధానియౌతావ్. 'గాంధీ' పేరులు మీ వంశానికి అచ్చిరాలేదు.

నెహ్రూ వంశీయుల పేర్లు నవ భారత నిర్మాణానికి నేతలుగా ఖ్యాతి నొందుతాయ్. నీవు త్వరగా పెళ్ళాడి ఓ బుల్లి నెహ్రూకు తండ్రి వయ్యావంటే నీవు రిటైరయ్యే నాటికి బుల్లి నెహ్రూ రాహుల్ ప్రధాని వయసువాడవుతాడు. మీది తరగని తిరుగలేని రాజవంశ మవుతుందయా?



# అయ్యారే...

## ఎన్టీఆర్ ఎంతగా ఎదిగారో, చివరకు అంతగా ఒదిగిపోయారు!

తొలి తరం సినీ నటులకు మూలాలు రంగస్థలమీద ఉండేవి. నందమూరి తారకరామారావు పూర్తిస్థాయిలో రంగస్థల నటులు కాకపోయినా... నాటకాల్లో నటించిన అనుభవం ఉంది. విజయవాడలో ఎస్.ఆర్. కళాశాలలో చదువు కొనేటప్పుడు 'రాచమల్లుని దౌత్యం'లో నాగమ్మ వేషం ధరించారు. తమాషా విషయం ఏమిటంటే – తల్లి ఇచ్చిన పట్టుచీర కట్టుకున్న ఎన్టీఆర్ మీసాలు తీసేందుకు మాత్రం ఒప్పుకోలేదు. గుంటూరు ఏసీ కాలేజీలో బియ్యే చదువుతుండగా 'మల్లమ్మ ఉసురు' నాటకంలో తాండ్ర పాపారాయుడి పాత్రలో జీవించి ప్రథమ బహుమతి అందుకున్నారు. నాటి ప్రముఖ దర్శకులు పుల్లయ్య 'కీలుగుర్రం'లో నటించమని ఎన్టీఆర్‌ని అడిగారు. అయితే బియ్యే పూర్తిచేయాలనే ఉద్దేశంతో ఆ అవకాశాన్ని వద్దన్నారు. ఆ తరువాత విజయవాడ దుర్గాకళామందిరంలో వారం రోజులపాటు రాష్ట్ర స్థాయి నాటక పోటీలు నిర్వహించారు. ఎన్టీఆర్ 'చేసిన పాపం' అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ పోటీకి నాటి సినీ దిగ్గజాలు పృథ్వీరాజ్‌కపూర్, శాంతారామ్, బీఎన్ రెడ్డి, హెచ్.ఎమ్.రెడ్డి, ఎల్వీ ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆ నాటకానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఎన్టీఆర్ నటనను అందరూ ప్రశంసించారు. శాంతారామ్ ఆయన సినిమాలో అవకాశమిస్తానని హామీ ఇచ్చారు. కొన్నాళ్లకు ఎల్వీ ప్రసాద్ నుంచి కబురు రావడంతో తెనాలి వెళ్తే... అక్కడ ఎన్టీఆర్‌కి ఫోటో షూట్ చేశారు. తరవాత మద్రాసులో మేకప్‌టెస్ట్ చేశారు. ప్రస్తుతానికి ఈ సినిమా తీయడంలేదు. పిదప చెబుతామని చెప్పడంతో ఎన్టీఆర్ నిరాశ చెందారు. సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగంలో చేరారు.

మరోసారి ఎల్వీప్రసాద్ నుంచే ఉత్తరం. 'ప్రముఖ దర్శకులు బి.ఎ.సుబ్బారావు 'పల్లెటూరి పిల్ల' తీయబోతున్నారు. మీరు రావాలి' అని అందులోని సారాంశం. ఎన్టీఆర్‌ని చూడగానే సుబ్బారావు మా సినిమాలో హీరోవి నువ్వే అన్నారు. అయితే ప్రసాద్‌గారికి చిన్న సందేహం వచ్చింది. 'ఏదైనా చిన్న పాత్ర నుంచి పెద్ద పాత్రలకు వెళ్తే అనుభవం వచ్చి రాణింపు ఉంటుంది. ముందు నేను తీసే 'మన దేశం'లో చిన్న పాత్ర ఇస్తాను. అది బాగుంటే మీరు అవకాశం ఇద్దురుగాని' అన్నారు. 'మీరిస్తే ఇవ్వండి, నా అభిప్రాయం మార్చుకోను' అంటూ సుబ్బారావు చెప్పారు. తరువాత రోజే సుబ్బారావు ఆయనకు రూ. 1116 అడ్వాన్సుగా ఇచ్చి ఉద్యోగానికి రాజీనామా చేయండి' అన్నారు. 'మన దేశం' చిత్రానికి కృష్ణవేణి నిర్మాత. ఆ సినిమాలో నటించినందుకు చిత్తూరు వి.నాగయ్య రూ. 90 వేలు, సి.హెచ్. నారాయణ రావు రూ. 25 వేలు పారితోషికంగా ఇచ్చి ఎన్టీఆర్‌కు రూ.250లు యిచ్చారు.

సినిమాలో పాల్గొన్నాక ఎన్టీఆర్ చెప్పిన తొలి సంభాషణ 'ఇంత చిన్న కానిస్టేబుల్ ఉద్యోగం నుంచి ఈ స్థాయికి ఎదిగాను' అన్నారు. ఆరోజు అన్నట్టుగానే ఊహించని ఉన్నతికి ఎదిగారు.



కృష్ణుడు, రాముడు, దుర్యోదనుడు వంటి పాత్రల్లో రావణాసురుడు, భీముడి వంటి పాత్రల్లో ఎన్టీఆర్‌ను నిజమైన శ్రీరాముడూ, శ్రీకృష్ణునిగా భావించేవారు అభిమానులూ, నిర్మాతలూ. తెల్లవారిగట్ల కోడి కూతకు ముందుగా ఆయన లేవడం గమనించిన నిర్మాతలు ఆయన వాకిట ముందే ఒకరు తలమీద మరొకరు కాళ్ళు పెట్టి 'క్యూ' కట్టి పడుకుని ఆయన లేచి బయటకు వచ్చేసరికి ఒక్కొక్కరూ పాద నమస్కారములు చేసి కాలుషీటు దరఖాస్తులు పెట్టుకుంటుంటే, ఒక రచయిత (పేరెందుకు లెండి) పాదాలకు నమస్కరించి హారతి యిచ్చేవారు. భూతాల రాజు గారు మేకప్ వేసుకుని వచ్చిన ఎన్టీ ఆర్‌కు కొబ్బరికాయు దిష్టి తీసేవారు. లైట్‌బాయ్‌లను సహితమూ 'గారూ' అని గౌరవంగా పిలిచే ఎన్టీఆర్, యీ పాదపూజలన్నీ చూచాక ఆయనలో 'మా' అనే 'Royal We' ప్రారంభమైంది. ఆ ఉన్న తౌన్నత్యాలను చూచిన ఒకాయన ఎన్టీయార్ రాజకీయాల్లోకి గొనివచ్చారు. తెలుగుదేశం పార్టీ స్థాపించిన ఆరు మాసాల్లోనే ఐదు పదులుగా ఉన్న కాంగ్రెస్ పీఠమును వేళ్ళతో పెకళించి, పెద్ద విజయంతో ప్రపంచమే విస్తుపోయేట్టు వీర శూర ముఖ్యమంత్రియై పసుపుదనంతో రాష్ట్రాన్ని ముంచెత్తేసారు. చరిత్రలో ఏ నాయకుడూ పార్టీ అంత పకడ్బందీగా, క్రమశిక్షణతో నడిపినవారు ప్రపంచ చరిత్రలో లేరు. సినిమా రంగంలో అన్ని కోట్లు సంపాదించినవారు అసలు లేరు. ఎదురుగుండా

# సినిమా తరుణీ పరికిణీ ఓణీ ధరించవమ్మా! అమ్మాయా! నీకిది బాగుందటే!



నిలిచి ధైర్యంగా మాట్లాడిన ధీరులూ లేరు. సింహంలా జీవించిన వ్యక్తి. దేశ నాయకుల్నే తన గుప్పెటకు తీసుకువచ్చిన శక్తిమంతుడు, భార్య బసవరామతారకం పోయిన తరువాత ఆయనజీవితం కృష్ణపక్షంలోకి వచ్చింది. పిల్లలకందరికీ ఇళ్ళు కట్టించి, ఎవరి ఆస్తులను వారికి పంచారు. ఎంతో పెద్ద సౌధంలో ఒంటరివాడయ్యాడు. పట్టించుకొనేవారు లేరు. ఒకసారి భానుమతి హైదరాబాదులో ఎన్టీఆర్‌ని చూడడానికి వెళ్ళారు. బాహాటంగా ఉన్న పెద్ద హాలులో ఒంటరిగా హాలులో కుర్చీలో కూర్చుని గోడమీద ఉన్న అర్థాంగి బసవరామతారకం ఫోటోను చూస్తూ, దైన్యంగా ఉన్నారు. ఆ దృశ్యాన్ని చూచిన భానుమతి హృదయం కదలిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయ్, ఎన్టీఆర్‌ది ఎంత పెద్ద కుటుంబం, ఎంతమంది సంతానం, ఎంత ఆస్తి, ఎంత సంపద, టాటా, బిర్లా, అంబానీలా ఆయన సంపాదించి, దోసెళ్ళతో ఆయన సంతానానికి పంచి యిచ్చాడు. ఒంటరితనమనే అనారోగ్యం, ఎవరూ తనకు లేరని దైన్యం ఆయన్ను వెంటాడింది. రాజులా బ్రతికి తనదైన ప్రతిభతో విశాలాంధ్ర భూమి నుంచీ, వినీలాకాశం వరకూ ఆయన ఖ్యాతి విస్తరిల్లింపచేసినవాడు. ఆయనకు ఎదురుగా నిలిచి మాట్లాడే ధైర్యం, స్థైర్యం కలవారు ఎవరూ లేని వారయ్యారు. నలుపూసల్లా అదృశ్యులయారు. నీటిలోని మొసలి బలాఢ్యత నీరసించిపోయి ఒడ్డునున్న బల్లిసామ్యంలా, ఆ కుర్చీకే ఆయన బల్లిలా అంటుకుపోయారు. మందిచ్చేవారు లేరు, మాట మాట్లాడేవారు లేరు. ఆ దృశ్యం గుండె దర్పం గల భానుమతి కళ్ళవెంట అశ్రువులు రాల్పించిందంటారు. గీతా సుబ్బారావు మాటలను 'తెలుగు విద్యార్థి' తేటపరిచింది.

పదిమంది మధ్య బ్రతికినవాడు, బసవరామతారకం అనుంగు వాత్సల్యాలతో రాజులా బ్రతికిన ఎన్టీఆర్ సపర్యలకు అభిమానంతో వచ్చిన లక్ష్మీపార్వతి అర్థాంగిగా తోడు వచ్చింది. ఆ తోడు రావడం ఎవరికీ ఇష్టంగాకపోవడమే కాదు, ఆయన్ను పదవీచ్యుతుణ్ణి చేయడానికి పథకం వేయించింది. అందరు ఎం.ఎల్.ఏలనూ వైస్రాయ్ హోటల్‌లో బంధించడం, ఎన్టీయార్ హృదయాన్ని అద్దంలా పగుళ్ళు తీసింది. అసలే ఆవేశపరుడూ, ఆత్మగౌరవం కలవాడు ఎన్టీఆర్ రాజమహల్‌ను వీడి, మండుటెండలో వైస్రాయ్ హోటల్ గేటు ముంగిట పడ్డాడు.

బ్రదర్స్! నేను మీ యన్టీఆర్‌ను వచ్చాను. రోడ్ మీదకు వచ్చి మిమ్మలినందర్నీ పిలుస్తున్నాను అని పిలిచారు. ఎన్టీఆర్ కారణంగా ఎదిగిన ఎం.ఎల్.ఏ.లు బయటకు రాలేదు. తొంగి చూడలేదు. ఆయన తన జీవితం చివరి దశలో, లక్ష్మీపార్వతిని తన ఆత్మీయ దైవం వేంకటేశ్వరస్వామి సమక్షంలో పెండ్లాడి, చివరి శ్వాస వఱకూ, ఆయన నిర్మించుకున్న నిరాడంబర గృహం బంజారాహిల్సులోని గృహంలోనే గడిపారు. ఎన్టిఆర్ ఏకాంతపు ఘోరైక నరక జీవితాన్ని భరించలేక ఆ 70 వయసులో లక్ష్మీపార్వతిని వివాహం చేసుకోవడం సరియైన నిర్ణయమేనని ప్రఖ్యాత నటీమణి పి.భానుమతి తనతో చెప్పారని గీతా సుబ్బారావు తెలుగు విద్యార్థి పత్రికలో వ్రాసిన విషయం బట్టి విశదమయింది. దేవేంద్ర భవనాల వంటి భవనాలను చెన్నై హైదరాబాదుల్లో నిర్మించి 11 మంది సంతానానికి పంచి, తాను నిర్మించిన తారక రామా స్టూడియో, తారకరామా థియేటర్ అబిడ్స్‌లోని జంట థియేటర్‌నూ, అపురూపంగా కట్టుకున్న భువనమంత భవనాన్నీ సంతతికిచ్చి వేసి, చివరి కాలంలో బంజారాహిల్సులోని సాధారణ ఇంటినీ, బసవరామ తారకరామ స్మారక భవనాన్ని కూడా కట్టుకుని దైన్యజీవితం అనుభవించారు. రాజకీయంగా తానెదిగింపచేసిన తెలుగుదేశం పార్టీ ఆధిపత్యం, ముఖ్యమంత్రిత్వం పోగొట్టుకుని దుఃఖాతిశయాన్ని, రోషాన్ని అతిశయించలేక, ఎర్రటి ఎండలో, కొలిమిలోని ఇనపకడ్డీలా కాలిపోతున్న టాంక్‌బండ్ రోడ్ మీద పడుకుని విలపించడం, అరవడం, విధియనుకోవాలా, రక్తజలగలు వంటి స్వజనం కృత్యమనుకోవాలా, **ఏమనుకోనూ? నేనుమనుకోను.**

**చి**వరి రోజుల్లోని సినిమాలు కలిసిరాలేదు. చివరి రోజుల్లోని రాజకీయం కలిసిరాలేదు. చివరిరోజుల్లోని స్వజనమూ కలిసిరాలేదు. శ్రీరాముడూ, శ్రీకృష్ణుడూ, శివుడూ, అవతారపురుషుడూ, ఆంధ్రుల అభిమానధనుడన్న ఎన్టీఆర్ అన్నిటినీ పోగొట్టుకున్న జీవితంగా మారిందని ఊహించలేకపోయాను. నేను దుఃఖాన్ని భరించలేకపోయాను. నా కళ్ళనిండా గోదావరి కృష్ణా నదులు వరదలై 'నీరు' ప్రవేశించినట్టు నా కళ్ళు నీటి కుండలయ్యాయి.

చనిపోయిన ఇన్ని సంవత్సరాల తరువాత హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు నటరత్న నందమూరి తారకరాముని పేరు పెట్టాలీ, నటరత్న నందమూరి తారక రామునికి 'భారతరత్న' బిరుదమివ్వాలని పోరాడుతూ, ఆరాటపడుతున్న ఈ నోళ్ళన్నీ ఆనాడు ఏమయ్యాయ్! మూతబడ్డాయా? ఆయనకు ఆలయాలు కట్టి, నలురోడ్ల కూడళ్ళపై శిలావిగ్రహాలు పెట్టి, పూదండలు వేస్తున్నవారు ఆనాడు లేరా? ఆఘోరాలను చూడలేదా? వినలేదా? అంధులా, బధిరులా! పదవిలో లేనివాడు ఎలా పోతే ఏఁవనుకున్నారా?

**కన్నతల్లి బ్రతికున్నంతకాలం, ఆమెను నానాబాధలు పెట్టి, నరకం చూపించి, గొంతులో గుక్కెడు నీళ్ళు పోసిన పాపాన పోనివాడు, ఆమెను చనిపోయిన తరువాత దహనం చేస్తూ, మా అమ్మకు ఆవుపాలంటే యిష్టం అని, పాలిచ్చే ఆవును తీసుకువెళ్ళి స్మశానంలోని ఓ రాటకు కట్టేశాడట** – అలా వున్నదీ చరిత్ర. వీధి కూడళ్లలో విగ్రహాలు పెడితే ఆయన చూడవచ్చాడా? 'భారతరత్న' యిస్తే ఆయనకు తెలుస్తుందా? ప్రస్తుతం ఆ పెద్దల తీరు కూడా అలాగే ఉంది. (గీతా సుబ్బారావు కాపీరైటు ఉవాచ.) ఇప్పుడు ఎన్టీయార్‌కు 'భారతరత్న' యిచ్చినా, ఆయన చేతులకు స్వర్ణ కంకణాలు తొడిగినా – ఆయన సంక్షోభిత హృదయం సంతోషిస్తుందా? ●



# మజ్జిగ తాగినవాడే మహనీయుడు



మంచుకొండల్లో ఉండే పరమశివుడుకి మజ్జిగ తాగే అలవాటుంటే ఆయన నీలకంఠుడెలా అవుతాడు? పాలసముద్రంలో ఉండే విష్ణుమూర్తికి మజ్జిగ త్రాగడం కష్టం కాబట్టే, ఆయన నల్లని వాడయ్యాడు! స్వర్గంలో 'సుర' తప్ప మజ్జిగ దొరకకే ఇంద్రుడు అంత దుర్బలుడయ్యాడు. మజ్జిగ తాగే అలవాటుంటే చంద్రుడికి క్షయ వ్యాధి. వినాయకుడికి పెద్ద పొట్ట. కుబేరుడికి కుష్టురోగం, అగ్నికి కాల్చే గుణం ఇవన్నీ వచ్చేవే కాదని యోగారత్నకరం వైద్యగ్రంథంలో ఒక చమత్కారం కనిపిస్తుంది. మజ్జిగ తాగేవాడికి ఏ వ్యాధులు కలగవనీ, తిరిగి రాకుండా వుంటాయనీ, విషదోషాలు, దుర్బలత్వం, చర్మరోగాలు, క్షయ, కొవ్వు, అమిత వేడి తగ్గిపోతాయనీ, శరీరానికి మంచి వర్చస్సు కలుగుతుందనీ దీని భావం. అక్కడ దేవతల కోసం అమృతాన్ని, ఇక్కడ మానవుల కోసం మజ్జిగని సృష్టించారట!

ప్రధాన ద్రావిడ భాషలన్నింటిలో మజ్జిగ అనే పదమే కనిపిస్తుంది.'మచ్చికై' అని తమిళంలోనూ, మజ్జిగే అని కన్నడంలోనూ పిలుస్తారు. ఇదే పదం ప్రాకృత భాషలో 'మజ్జిఅ'గా కనిపిస్తుంది. సంస్కృతంలో మార్జిత అనే ప్రయోగం ఉంది.

నిండా బాక్టీరియాని కలిగిన ఏకైక ఆహార ద్రవ్యం మజ్జిగ! యాంటీ బయాటిక్ ఔషధాలు బాక్టీరియానే కలిగి ఉంటాయి. కానీ, అవి శరీరానికి వ్యతిరేకంగా పనిచేయటం ద్వారా చెడు బాక్టీరియాను ఎదుర్కొనేలా చేస్తాయి. కానీ మజ్జిగ అనుకూలంగా పనిచేసి, శరీరాన్ని శక్తిమంతం చేయటం ద్వారా వ్యాధిని ఎదుర్కొనేలా చేస్తుంది. అందుకని, మజ్జిగని 'ప్రో బయాటిక్ ఔషధం' అంటారు. ఇందులో సజీవమైన లాక్టో బాక్టీరియా ఉంటుంది. ఇవి ఉపయోగకరమైన సూక్ష్మజీవులు, చిన్న ప్రేవులలోకి వెళ్ళినా సజీవంగానే ఉండి, మేలు చేస్తాయి. విటమిన్లు తదితర పోషక విలువలను వంటబట్టేలా చేస్తాయి. జీర్ణప్రక్రియని సక్రమంగా ఉంచుతాయి. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. గుండె జబ్బులూ, కేన్సర్ లాంటి వ్యాధులను అదుపు చేయటానికి తోడ్పడతాయి. మజ్జిగపైన తేరుకున్న నీటిలో ఉపయోగపడే బాక్టీరియా బాగా ఉంటుంది. అందుకని, జీర్ణకోశ వ్యాధులతో బాధపడేవారు మజ్జిగ తేటను వంచుకొని మిగతా మజ్జిగలో మళ్ళీ నీళ్ళు పోస్తుంటే, మన మజ్జిగ మనకే ఉంటుంది. కడుపులోకి కావలసిన బాక్టీరియా చేరుతుంది.

మజ్జిగని నాలుగు రకాలుగా వైద్యశాస్త్రంలో పిలిచారు. గట్టి పెరుగును నీళ్ళు కలపకుండా, మీగడ తీయకుండా చిలికిన మజ్జిగని 'ఘోలకం' అంటారు. మీగడని మాత్రం తీసి చిలికిన గట్టి పెరుగుని మథితం అనీ, నాలుగో వంతు నీళ్ళు కలిపి చిలికినది 'తక్రం' అనీ, సగం నీళ్ళు కలిపి చిలికినది 'ఉదశ్వితం' అనీ పిలుస్తారు. మన ఇళ్ళలో ఎక్కువగా తక్రాన్ని వాడుతాం. అందుకని మజ్జిగకు 'తక్రం' అనే పేరు స్థిరపడింది. ఇది అన్ని దోషాలనూ హరించేదిగా ఉంటుంది. గేదె మజ్జిగకన్నా ఆవు మజ్జిగ ఎక్కువ మేలు చేస్తుంది. చిలకడం వలనే మజ్జిగకు తేలికగా అరిగే గుణం. ఆరగించే గుణం కలుగుతున్నాయి. అందుకనే పాలుకన్నా పెరుగు, పెరుగుకన్నా మజ్జిగ శ్రేష్ఠమైనవిగా ఉంటాయి. ఫ్రిజ్జులోంచి అప్పటికప్పుడు మంచుగడ్డలా ఉండే పెరుగుని తినడానికి మనం అలవాలుపడిపోతాం. షుగర్ వ్యాధి రోగుల సంఖ్య పెరగటానికి, ఆ వ్యాధి తీవ్రత పెరగటానికి  ఈ దురలవాటే కారణం. ఫ్రిజ్జులోంచి తీసి, బాగా చిలికి, కొద్దిగా వెచ్చచేసిన మజ్జిగ మంచి చేస్తాయని గమనించాలి. ధనియాలు, జీలకర్ర, శొంఠి మూడింటినీ మెత్తగా దంచి, తగినంత ఉప్పు చేర్చిన పొడిని కొద్దిగా కలుపుకొంటే ఆ మజ్జిగ ఎక్కువ మేలు చేస్తుంది. జలుబు, పడిశభారం ఉన్నవాళ్ళు మజ్జిగని కాచి తాగాలని ఈ గ్రంథం సూచిస్తుంది.

పుల్లని మజ్జిగలలో సగం పాలు కలిపి కాచిన దాన్ని 'కూర్చిక' అంటారు. మజ్జిగలో పాలు, బెల్లం, తగినంత చేర్చి కాస్తే "తేమనం" అనే తెలుగు వంటకం తయారవుతుంది. బెల్లానికి బదులుగా అల్లం మిర్చి, కొత్తిమీర, ఇతర సంబారాలు వేసి కాచిన మజ్జిగ పులుసు, మెంతులు తేలికగా నూరి తాళింపు పెట్టిన మెంతి మజ్జిగ తెలుగిళ్ళలో ప్రసిద్ధి. మజ్జిగ పులుసును 'మోరు' అనే పేరుతో పిలిచేవారని "గారెలు బూరెలు చారులు మోరులు" అని ఉత్తర రామచరితంలో ప్రయోగాన్ని బట్టి తెలుస్తోంది. బియ్యప్పిండి, అల్లం తదితర సంబారాలు చేర్చి ఉండలు కట్టి మజ్జిగ పులుసులో వేసి వండిన ఉండల్ని 'మోరుండలు' అంటారు. వీటిని ఆవడల్లాగా తినవచ్చు.

మజ్జిగలో పంచదార లేక తేనె కలిపిన పానీయమే లస్సీ! ఇది హిందీ లేదా పంజాబి పదం కావచ్చు. వేసవికాలంలో నిమ్మరసం, జీలకర్ర పొడి, ఉప్పు, పంచదార కలిపి పొదీనా ఆకులు వేసిన లస్సీ వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. దీన్ని 'సిగరి' అంటారు. శిఖరిణి అనే సంస్కృత పదానికి ఇది తెలుగు రూపం కావచ్చు. చిక్కని మజ్జిగ అయితే లస్సీ అనీ, వెన్న తీసేసి, నీళ్ళు ఎక్కువ కలిపితే 'దాస్' అనీ పిలుస్తారు. టర్కీలో Ayran, ఆర్మీనియాలో Than, పర్షియాలో Doogh, ఆల్బేనియాలో Dhalle అనే పానీయాలు ఇలాంటివే! గుర్రం పాలతో Kumiss అనే పానీయాన్ని మధ్య ఆసియా స్టెప్పీలు ఇష్టంగా తాగుతారట! పర్షియన్ ఫాబిబీరిది అనేది మన మజ్జిగ పులుసు లాంటిదే! ఇందులో వెల్లుల్లి మసాలా  బాగా కలిపి రొట్టెల్లో నంజుకుంటారు. పచ్చి పాలు పోసిన తోలు సంచీని గుమ్మానికి తగిలించి ఉంచితే, తలుపు తీసినప్పుడల్లా సంచీ కదిలి లోపల ఉన్న పాలు వాటికవే తోడుకొంటాయట. కాకేసస్ పర్వతశ్రేణి ప్రాంతాల్లో దీన్ని 'కేఫీర్' అంటారు. ఐర్లండ్‌లో తినే సోడా ఉప్పు, మజ్జిగతో చేసిన రొట్టెలు దొరుకుతాయి. మనవాళ్ళు కూడా బొంబాయి రవ్వ చేర్చి రవ్వట్టు చేస్తుంటారు.

మజ్జిగ వాడకం దక్షిణాదివారికున్నంతగా ఉత్తరాది వారికి లేదు. మధురా నగరిలో చల్లలమ్మబోయే అమ్మాయిల దారికి అడ్డం పడ్డాడు గానీ, తెలుగుకృష్ణుడు పెరుగులమ్మబోయేవారికి కాదు గదా!

– డా॥ జి.వి.పూర్ణచందు

## సోనియాకంత నవ్వెందుకో!



ఎందుకమ్మా సోనియా! అంత పగలపడి నవ్వుతున్నావు! నవ్వురాని మన్మోహన్ కూడా మన్మోహనంగా నవ్వుతున్నాడు. ఆ నవ్వుల విశేషాన్ని సొట్టబుగ్గల రాహుల్ మొబైల్ నందు భద్రపరుస్తున్న విశేషమేమిటమ్మా!


రాహుల్ రాజకీయ పీఠం అలంకరిస్తున్నాడని సంబరమా! సోనియమ్మా,
నీ నవ్వును ఎన్నికల వరకూ కొంత దాచుకోవమ్మా!

# వేద వేదాంత గురుకుల మహా విద్యాలయం! శ్వేత శృంగాచలం

మహావిద్యాలయ మహాకులపతులు దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామివారు, ప్రస్తుతం విజయయాత్రలో ఆంధ్రదేశములో పర్యటన చేయుచున్నారు. శ్రీ చరణులు మహావిద్యాలయమునకు శ్రీ స్వామివారు 18-2-2014న విచ్చేసి 5 రోజులు అక్కడి కార్యక్రమములు నిర్వర్తిస్తూ 22-02-2013 ఉదయం శ్రీ శారదా పరమేశ్వరి ప్రతిష్ఠ, అమ్మవారి గుడి కుంభాభిషేకము నిర్వర్తించెదరు.

వేదవిజ్ఞానద్రష్ట భరద్వాజ మహర్షి వేదములలోని సత్యాలను కనుగొనుటకై చాలాకాలం జీవించారు. వేద రహస్యాలు పూర్తిగా తెలుసుకోవడం కోసం ఆయన తన జీవితకాలాన్ని పలుమార్లు పొడిగించారు. అన్ని సంవత్సరాల ఆయన కృషి అనంతమైన వేదసంపద అనే మహాపర్వతంలో ఒక పిడికెడు మాత్రమే. ఆ కృషిలో భాగంగా ఆయన తన శిష్యబృందంతో కొన్నేళ్ళు శ్వేతశృంగాచలంలో నివసించారు. శ్వేతశృంగాచలం తపోభూమి. అదినేటికీ, నిక్షిప్తతపోశక్తితో తేజోవంతముగా ఉన్నది.

శ్వేతశృంగాచలానికి శిరోభాగంగా భరద్వాజకొండ అని పిలవబడుతున్న పెద్ద కొండ ఉన్నది. అక్కడి శిఖర శివలింగం భరద్వాజ మహర్షిచే ప్రతిష్ఠింపబడినదని ప్రతీతి. ఆ కొండను తాకి పవిత్ర కృష్ణానది దిశ మార్చుకుని, దాదాపు 3 కి.మీ. ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్నది. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న పులిచింతల ప్రాజెక్టు ఉత్తరవాహిని ప్రారంభంలో ఉన్నది. 3 కి.మీ. ప్రవహించి, కృష్ణా నది వెనుతిరిగి, మలుపు తీసుకుని ప్రవహించి అటుపై విజయవాడ చేరుతుంది. ప్రసిద్ధి చెందిన వేదాద్రి యోగ నరసింహస్వామి ఆలయం ఉత్తరవాహిని తూర్పు కొమ్మన ఉన్నది.



నాటి శ్వేత శృంగాచలం అని పిలవబడే పవిత్ర ప్రాంతం భరద్వాజ కొండతో ప్రారంభించి ఉత్తరవాహినిగా ప్రవహించి మలుపు తిరిగిన కృష్ణాతీరం ఆనుకుని వేదాద్రి దాకా ఉన్న ప్రదేశం అంతా వ్యాపించి ఉంది. ఎంతోమంది సద్గురువులు నేటికీ అక్కడ తపోశక్తిని గుర్తించి అనుభూతి పొందారు. నేటి ప్రజలకు చాలామందికి అక్కడి పురాణచరిత్ర తెలియదు.

ముక్త్యాల జమీందారుల ఇలవేల్పు అయిన ముక్తేశ్వరస్వామి బలిచక్రవర్తి ప్రతిష్ఠ, శ్వేతశృంగాచలం ఉత్తరపుకొసన ముక్త్యాలలో (ముత్యాల అంటారు నేడు) ఉన్నది.

శ్వేతశృంగాచలం తూర్పు భాగంలో ఉన్న వేదాద్రిలో వేదాలన్నిటిని విష్ణుమూర్తి భద్రం చేశారని, ప్రహ్లాదుని ప్రార్థనకు మేర విష్ణుమూర్తి యోగ నరసింహస్వామిగా వెలిసి వేదాద్రిని పాలిస్తున్నారనీ, స్థలపురాణం. శ్వేతశృంగాచల దక్షిణ భాగాన భరద్వాజ కొండ ఉన్నది. ఉత్తర వాహిని శ్వేత శృంగాచలానికి పశ్చిమాన ఉన్నది.

ఉత్తర దిక్కుగా ప్రవహించే కృష్ణమ్మ తల్లి పురమ పుణ్యప్రదమని, అందుచే దేవతలు, దైవశక్తులు అక్కడ స్నానమాచరిస్తారని ప్రతీతి. దేవతలే కాదు, అనేకమంది మహర్షులు, సద్గురువులు నాటికి, నేటికీ కూడ ఉత్తరవాహిని కృష్ణాలో స్నానమాచరించి, ఆ పుణ్యతపోభూమిలో తపమాచరించి తమ పుణ్యశక్తులను పెంపొందించుకుంటూనే ఉన్నారు.

ఈ ప్రదేశంలో గల 11వ శతాబ్దికి చెందిన శిలాశాసనం ఈ స్థల ప్రాముఖ్యతను వివరిస్తున్నది. కాశీపతి పత్ని అయిన గంగాదేవి, పాపహారిణి, ప్రజల పాపాలన్నీ తొలగించి, తనలో కలిసిన ఆ కల్మష విమోచన కోసం కాశి రూపంలో వచ్చి, ఉత్తరవాహిని కృష్ణలో స్నానం చేసి, పవిత్రతను పొంది, తిరిగి వారణాసికి వెళ్ళిందట. ఆ ప్రదేశమే నందుల రేవు. సూర్యోదయ సమయాన భరద్వాజ కొండ నంది రూపంలో ఉత్తరవాహినిలో దర్శనమిస్తుంది. అందుకే ఆ ప్రదేశం నందుల రేవు.

ఇంత సుదీర్ఘచరిత్ర కలిగిన శ్వేతశృంగాచలమే మన వేద వేదాంత గురుకుల మహావిద్యాలయానికి మూలస్థానము పునాది. ఆది శంకర స్థాపిత దక్షిణామ్నాయ శృంగేరీ శారద పీఠానికి చెందిన మహా విద్యాలయానికి తగిన ప్రదేశానికి శ్రీ శారదాదేవే దారి చూపిందంటే అతిశయోక్తి లేదు. ఎందుకంటే, ఎన్నో ప్రదేశాలు పరిశీలించి, శ్వేతశృంగాచలము తగిన స్థలంగా ఎంపిక చేసే నాటికి ఈ స్థల పురాణమే తెలియదు. ఇది నమ్మశక్యం గాని నిజం అలా ఈ ప్రయాణం మొదలైంది.

మానవ ప్రగతికి మొట్టమొదటి వనరు విజ్ఞానం (Science) అని చెప్పవచ్చు. మానవజాతి ఎదుర్కొనే అనేక సమస్యలను అడ్డంకులను, దాటుకుంటూ ఉపశమనం కలిగించేది విజ్ఞానశాస్త్రం. సత్యాన్వేషణతోనే విజ్ఞానశాస్త్రం మొదలైంది. గురుత్వాకర్షణ సిద్ధాంతం కనుగొన్నప్పుడు అది పరమ సత్యంగా కీర్తింపబడినది. మనం రోజూ చూసే అనేక విషయాలకు వివరణ ఆ సిద్ధాంతంతో అప్పుడు ఇవ్వగలిగారు. తరువాత సాపేక్ష (Relatavity) సిద్ధాంతం మరిన్ని కొన్ని సత్యాలను ఆవిష్కరించడంతో పాటు, గురుత్వ సిద్ధాంత అసత్యాలను చూపింది. Quantam సిద్ధాంతం అంతకు ముందు సిద్ధాంతాలలోని లొసుగులను చూపింది. అలా విజ్ఞానశాస్త్రంలో కొత్త కొత్త పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. పాత కాలంలో సత్యం అనుకున్నది అంత సరికాదని, అసత్యాలని నిరూపిస్తూనే ఉన్నది. ఏది పరమసత్యం 'N' అనేది ఇంకా శాస్త్ర ప్రపంచానికి అందీ అందక ఊరిస్తూనే ఉన్నది.


మహా విశ్వానికి చెందిన ఒక గొప్ప సిద్ధాంతం సర్వైకర్త్ర సిద్ధాంతం (Grand Universal Thery). ప్రపంచంలో జరిగే అన్ని ఘటనలనూ వివరించగల ఒకే ఒక ఆ సిద్ధాంతం కోసం అన్వేషణ నిరంతరంగా సాగుతూనే ఉన్నది. యిది ఒక గట్టి నమ్మకము.

ఈ అన్వేషణలో విజ్ఞానశాస్త్రం ఆదిశంకరుల వారి అద్వైత సిద్ధాంతలోకే వచ్చి చేరుకున్నది. ఎంతో మంది శాస్త్రవేత్తలు అద్భుతమైన అద్వైత సిద్ధాంతం చూసి ఆశ్చర్యచకితులయ్యారు. పదార్థం, శక్తి రెండు ఒక వస్తువు యొక్క రెండు రూపాలని సాపేక్ష సిద్ధాంతం చెపుతున్నది. ప్రకృతి పురుషుడు వేరు కాదు. ద్వైతం (రెండు) కాదు. ఒకటేనని అద్వైత సిద్ధాంతం చెపుతున్నది. ఇలా అనేక అన్వయాలు అద్వైత అద్భుతాలు చూస్తున్నారు శాస్త్రవేత్తలు. ఈ జగత్తు ఎలా ఉద్భవించినది? ఏకత్వము నుండి!

వేదములు పరమ సత్యములు. ఇహము, పరమునకు చెందిన అన్ని విషయాలనూ వేద విజ్ఞానంతో చక్కగా వివరించగలము. ఈ దృశ్య ప్రపంచంలో (ఇహంలో) జరిగే ప్రతి ఘటననూ మరియు ఈ ప్రయాణంలో మనకు దారిచూపే ధర్మశాస్త్రాలనీ చక్కగా వివరిస్తుంది వేద విజ్ఞానం. అంతేకాక పరము అంటే మనుషుల మరణం తరువాత ఏమవుతుంది. ఎక్కడికి వెళతారు? మన కంటికి కనిపించని విశ్వంలోని అనేక లోకాలన్నిటినీ, ఆ సత్యాలన్నిటినీ కూడా తెలియచేస్తుంది వేదవిజ్ఞానం. కర్మసిద్ధాంతం, జన్మలు రాహిత్యములు ఎన్నో ఎన్నో యింకెన్నో.

ఎంతో శ్రమపడి శాస్త్రవేత్తలు కనుగొన్న, కనుగొంటున్న, ఇంకా తెలియని ఎన్నో రహస్యాలను మన మహర్షులు, వారి తపోశక్తితో, దివ్యదృష్టితో దర్శించి వేదాలుగా మనకు అందించారు. వేద విజ్ఞాననిధి అనంతం. అద్వితీయం ఆ ఎరికకే ఒక పెద్ద వేద మహా విద్యాలయాన్ని స్థాపించి వేద విజ్ఞానాన్ని, దానిలో పరిశోధనను ప్రపంచమంతా అందరికీ వ్యాపింపచేయాలనే సంకల్పానికి ప్రేరణ. దక్షిణామ్నాయ శృంగేరి పీఠాధాపతి శంకరాచార్య శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామి 'వేద వేదాంత గురుకుల మహావిద్యాలయాన్ని' ఆశీర్వదించి దానికి మహాకులపతిగా (Chhancellor) దారిచూపుతున్నారు. మహావిద్యాలయము యొక్క ఏకైక ఆశయం మానవాళి అందరికీ ఉపయోగపడే విధంగా వేద విజ్ఞానాన్ని నేర్చుకొనుటకు, బోధించుటకు, ఆచరణలో పెట్టుటకు, అందులో సత్యశోధనకు తగినవిధంగా ఒక చక్కని, పరిపూర్ణమైన వేదవిజ్ఞాన పరిశోధన కేంద్రాన్ని స్థాపించడమే. వైదిక ధర్మం, విజ్ఞానం మానవాళికి ఒక భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి మానవ ప్రగతికి దోహదం చేస్తుంది. ఇదే మహా విద్యాలయము యొక్క నమ్మకం, సత్యం.

- **ఎం. హెచ్. అవధాని,** మల్లాది సంస్థల ఛైర్మన్, తెనాలి
ఫోన్ : (08644) 227901, ఫ్యాక్స్ : 222683



# మలేసియా తెలుగు సంఘం వారితో కలిసి నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సమాఖ్య పదవ మహాసభలు

## - ఇద్దరు అనుభవజ్ఞులూ, ఆత్మీయత మూర్తీభవించిన రథ సారధ్యుల దక్షతన జరుగుతున్న సభలు! -

### - విజయనామ సం॥ర తెలుగు విజయ మహోత్సవం -



**సోదర సోదరీమణులకు అభినందనలు**

ప్రపంచ తెలుగు సమాఖ్య ఒక లాభాపేక్ష లేని, రాజకీయేతర సాంఘీక సేవా సంస్థగా ఇరువది సంవత్సరముల నుండి ప్రపంచం అంతటా విస్తరించి ఉన్న తెలుగువారి మధ్య సంఘీభావాన్ని పెంపొందించడానికి ఘనమైన మన వారసత్వం తెలుగు భాషా సాహిత్యాలు, సాంప్రదాయక, ఆధునిక కళలు క్షీణించిపోకుండా పదిలపరిచి భావితరాలవారికి అందించాలన్న సదాశయంతో కృషి చేస్తున్న విషయం విదితమే.

గడిచిన రెండు దశాబ్దాలుగా రెండేళ్లకొకసారి అంతర్జాతీయ మహాసభలు ద్వారాను, సభలు, సమావేశాల ద్వారాను విద్వద్గోష్టుల పరంగానూ ఈ తన సేవా ధర్మాన్ని నిర్వహిస్తూ వస్తున్నది. ఇంతవరకూ చెన్నపురి, హైదరాబాదు, కొత్త ఢిల్లీ, విశాఖపట్టణం, సింగపూర్, బెంగళూరు, దుబాయ్, విజయవాడలలో ఈ సభలు జరిగాయి. కాగా, దశమ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలను ఈసారి కౌలాలుంపూర్ (మలేషియా) నగరంలో 2013 ఏప్రిల్ 12, 13, 14 తేదీలలో సన్వే రిసార్ట్ హోటల్ ప్రాంగణంలో జరపాలన్న నిర్ణయం జరిగింది. ఈ సభలను ప్రపంచ తెలుగు సమాఖ్య మరియు తెలుగు మలేషియా సంస్థల అధ్వర్యంలో జరుగుచున్నవి. ఈ మూడు రోజుల సభల సందర్భంలో కవితా గోష్ఠులూ, మనవైన కళారూపకాల ప్రదర్శనలు, సంగీతం ఉంటాయి. ఆయా రంగాలలో నిష్ణాతులైనవారు పాల్గొననున్నారు.

మన సమాఖ్య విశాఖపట్టణంలో ఒక అపురూపమైన చారిత్రక కళానిలయంగా 'తెలుగు సాంస్కృతిక నికేతనమ్' పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారితో కలిసి నిర్మించే కృషి జరుగుతున్న విషయం కూడా తెలిసినదే. సుందరమైన కైలాసగిరి శిఖరాన ఈ కళానిలయం ఏర్పాటు అవుతున్నది. కాబట్టి మీరూ, మీ కుటుంబ సభ్యులూ, మిత్రులూ, మహాసభ ప్రతినిధులుగా చేరి సభల ఘనవిజయానికి తోడ్పడాలని మిమ్ములను సాదరంగా ఆహ్వానిస్తున్నాను.

**వి.యల్. ఇందిరాదత్**
సమాఖ్య అధ్యక్షులు



**గౌరవనీయులైన తెలుగు పెద్దలకు,**
**నమస్కారం,**

ప్రపంచ తెలుగు సమాఖ్య పదవ ద్వైవార్షిక మహా సభలు 2013 ఏప్రిల్ 12 నుండి 14 వరకు మలేసియాలో కౌలాలంపూర్ నందు జరగబోవు సందర్భాన్ని పురస్కరించుకొని మలేసియా తెలుగు సంఘం తరఫున నేను మీ అందరినీ ఈ అంతర్జాతీయ మహాసభలకు హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాను. మొదటిసారిగా ఈ మహాసభ "విజయ నామ ఉగాది" మరియు "విసీట్ మలేషియా 2013" సందర్భములో నిర్వహింపబడుచున్నది. ఈ సమావేశం దేశ మరియు విదేశీ తెలుగు ప్రతినిధులు కలిసి ఒకే అంతర్జాతీయ వేదికపై ఉగాది వేడుకలను జరుపుకొనుటకు గొప్ప అవకాశమని భావించవచ్చు. భిన్న జాతులు, మతాల సంస్కృతులతో విలసిల్లుతున్న మలేసియా దేశములో అన్నీ జాతుల, మతాలవారి హక్కులతో పాటు అల్ప సంఖ్యాకులైన తెలుగు వారి భాషా, సంస్కృతి కూడా పరిరక్షింపబడుచునది. ప్రపంచంలో ప్రవాసాంధ్రులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్న దేశము మలేసియా అని చెప్పవచ్చు. మలేసియా దేశాన్ని చూసి, వారి ఆతిథ్యాన్ని స్వీకరించడం ఒక ప్రత్యేక అనుభూతి కాగలదు.

ఈ సమావేశంలో తెలుగు భాష మరియు సంస్కృతులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చలు, సదస్సులు మరియు జాతీయ, అంతర్జాతీయంగాగల వాణిజ్య అవకాశాలపై సదస్సులు నిర్వహింపబడును. ఈ సందర్భములో తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి మరియు వాణిజ్యపరమైన అంశాలపై ఆసక్తిగల ప్రతినిధులు "పేపర్ ప్రజెంటేషన్" ఇవ్వవచ్చును.

ఈ వేడుక జరుగు మూడు రోజుల పాటు సాయం సమయ వేళలలు జాతీయ, అంతర్జాతీయ కళాకారుల సంగీత, నృత్య ప్రదర్శనలతో పండుగ కోలాహలంతో నిండి ఉంటుంది.

ఈ కార్యక్రమములో పాల్గొనుటకు మీ పేరు నమోదు చేసుకొనగోరువారు ఈ సమావేశాల కార్యదర్శిని, పత్రికలో ఇవ్వబడిన ఈ-మెయిల్ ద్వారా వెంటనే సంప్రదించగలరు. ఈ సమావేశం అనుభూతులు మీ మదిలో చిరకాలం నిలిచిపోయే విధంగా నిర్వహించడం మా కర్తవ్యంగా భావిస్తున్నాను.

ఈ అంతర్జాతీయ వేదిక వద్ద మీ అందరి ఆగమనానికై నిరీక్షిస్తుంటాను. ధన్యవాదాలు.

**డతో. డా. అచ్చయ్య కుమార్ రావు,**
పి.జే.ఎన్; కె.ఎం.ఎన్; పి.జే.కె.
ప్రధాన అధ్యక్షుడు
మలేసియా తెలుగు సంఘం,
మహాసభ
కార్యనిర్వహణా
అధ్యక్షుడు



# శ్రీరస్తు శుభమస్తు ఆచంద్రతారార్క అన్యోన్యప్రాప్తిరస్తు!

## - దీవెనలందచేసేది దివ్యమైన వివాహం -

మన సాంప్రదాయంలో వివాహం మహదానందకర శుభశీలత నిండి ఉన్నది. వేదోనుసారమైన ఈ వివాహ శుభక్రతువును ఐదు రోజులపాటూ ఆనంద మకరందకర సౌభాగ్య సంపన్న శుభకార్యంగా వధూవరులను లక్ష్మీనారాయణ స్వరూపులుగా సంభావించి జరపడమనేది సర్వ సంపత్కర, సత్‌సంతాన వృద్ధికర, వంశోన్నతిని ఊరి పెద్దలందరూ ఆశీర్వదిస్తూ, అనుక్షణం ఆనందాబ్ధికరంగా జరిపే మహోన్నత, మహత్తరకరమైన పర్వం. ఊరి వృత్తి వర్ణాల వారందర్నీ కలుపుకొనిపోయే కల్యాణప్రదమైనదే కాబట్టి కల్యాణం' అన్నారు. రాజరియైన జనక మహారాజు లక్ష్మీనారాయణాంశులైన సీతారామచంద్రుల వివాహం చేస్తూ,

**ఇయం సీతామమ సుతా సహధర్మ చరీతన**
**ప్రతీక్ష చైనాం భద్రం తేపాణిం గృహ్ణీష్వ పాణినా**

– తన కుమార్తె సీత చేతిని శ్రీరామచంద్రుని చేతికి తాకిస్తాడు. ఈ పద్యభావాన్ని వాల్మీకి పదసారానికనువుగా ఈ సీత నా కూతురు, నీ సహధర్మచారి, **దీనినింగైకొనుమా కౌసల్యాసుత! నీకును భాసుర సుమమగు గ్రహింపు పాణింబాణన్** – సరిజోదుగా తెనిగించారు.

అందుకే వివాహం చేసేవారు, ఒకవైపు పసుపు, మరోవైపు కుంకుమ రంగుల కాగితంపై శుభలేఖను వేస్తూ, వివాహ మహోత్సవ ఆహ్వాన శుభపత్రిక పసుపురంగు కాగితం పనుపున

**శ్లో॥ జానక్యాః కమలాంజలిపుటేయాః పద్మరాగయితా**
**న్యస్తా రాఘవ మస్తకేచ విలసత్కుంద ప్రసూనాయితా ।**
**స్రస్తా శ్యామల కాయ కాంతి కలితాయః యింద్రనీలాయితాః**
**ముక్తాస్తా శుభదాభవంతు భవతా శ్రీరామవైవాహికః ॥**

– తెలుగు వారిలో రాజులు సహితమూ, తమ ఇంటి కల్యాణమునకు పై లేఖను పట్టువస్త్రములపైగానీ, వెండిరేకులపై గానీ వ్రాయించి పంపేవారు. తరువాత కాగితము వచ్చి, తరువాత కాగితముపై విధంగా శ్లోకము ప్రారంభించి, ఇంటి పెద్ద పేరిట శుభలేఖలు వేసి పంపడం శుభప్రదంగా భావించేవారు. ఇప్పుడువన్నీ మారిపోయినా, జానకీరాముల కల్యాణ వైవాహిక శ్లోకం మాత్రము చాలామంది తెలుగువారి వివాహ పత్రాలపై మారిపోలేదు. ఇప్పుడు కొందరు వధూవరులే **'మా పెళ్ళికి రండి'** శుభలేఖలు వేస్తున్నారు. *నాకు ఫలానా వారి అమ్మాయి, లేదా ఫలానా వారి అబ్బాయితో పెండ్లియని పెళ్ళివేదిక, సుముహూర్తం తెలిపే వివాహ శుభలేఖ వృత్తాంతాన్ని డి.వి.డి.లు సి.డి.లో తన ధ్వని ముద్రగా చేసి పంపుతున్నారు. ఓ జర్నలిస్టు తన పెళ్ళికి కాగితంపై బాక్సు కట్టి – 'హాయ్' నా పెళ్ళికి రా గురూ! జస్ట్ ఆఫ్ డే సమయం కేటాయించు గురూ! మీరూ, మీ ఇంట్లో వాళ్ళు భోజనం చేసి, బీడా వేసుకుని వెళ్ళాలి సుమా' అని వేసాడు.*

### గోపురం వారూ, వివేక్ వారూ మా ఇంటి పెళ్లికి రండి!

*శ్లో॥ జానక్యాః కమలాంజలిపుటేయాః పద్మరాగయితా*
*న్యస్తా రాఘవ మస్తకేచ విలసత్కుంద ప్రసూనాయితా ।*
*స్రస్తా శ్యామల కాయ కాంతి కలితాయః యింద్రనీలాయితాః*
*ముక్తాస్తా శుభదాభవంతు భవతా శ్రీరామవైవాహికః ॥*

*ఈ శ్లోకంతోనే తెలుగువారింట శుభలేఖలు ప్రారంభమయ్యేవి. రాజుల కాలంలో పట్టువస్త్రాలపై రాయించి పంపేవారని చరిత్రకారులు చెబుతారు. వెండి రేకులపై బంగారు అక్షరాలతో చక్రవర్తులు శుభలేఖలు తయారుచేయించారని కథలుగా చెబుతారు. సామాన్య మధ్యతరగతి వారు మాత్రం ముహూర్త సమయాన్ని, పెళ్లి జరిగే స్థలాన్ని స్వయంగా వెళ్ళి చెప్పి పిలిచేవారు. సాంప్రదాయం ఇప్పటికినీ నిలదొక్కుకుని చెప్పడానికే ఈ వ్యాసం.*

ఇలా వాళ్ళపై పెళ్ళికి వాళ్ళ పెళ్లికి వాళ్లే పిలుచుకునేనే పద్ధతి ప్రారంభమైంది. ఇంకో ఆయన పెండ్లి చేసుకొనే వధూవరుల ఫోటో ముఖచిత్రం వేసి 144 పేజీల శుభలేఖను పెళ్ళిపుస్తకంగా వేసారు. మరొకాయన సి.డి.ని వేయగానే మీకు చేతులెత్తి నమస్కారం చేస్తున్నాను. మా అమ్మాయి పెళ్ళి, మా బావగారి అబ్బాయితో జరుగుతున్నది. మీరు సకుటుంబంగా వచ్చి, వధూవరులను ఆశీర్వదించి సుష్టుగా భోజనం చేసి, మేమిచ్చే తాంబూలం వేసుకుని వెళ్ళాలి' అంటూ ఓ పట్టువస్త్రంపై వధూవరుల పేర్లూ చిత్రాలతో పంచారు.

ఇలాటి భేషజాలు పోని, ఇరు ప్రముఖ వైశ్య కుటుంబాల వారు ఎటువంటి ఆడంబరములూ పోకుండా గోపురం కుంకుమం అధినేత వై.హరికృష్ణ తమ కుమార్తె ల॥సౌ॥ ప్రణవి క్రిష్ణను, 'వివేక్' అధినేత బి.కె. కోదండరామచెట్టి కుమారుడు చి॥ బి.కె. విజయ్ వచ్చి వివాహం చేస్తూ, సాంప్రదాయబద్ధంగా పసుపు కుంకుమలతో నూతన వస్త్రాలు, పండు ఫలాలతో దంపతులు వచ్చి, సాంప్రదాయబద్ధంగా పిలవడం చూచి, ఎన్నో తరాల వెనుకటి ఆత్మీయతను స్ఫురింపచేసింది. మద్రాసులో ఉన్ననూ సాంప్రదాయం మరువని వైశ్య కుటుంబాల ఆహ్వాన పద్ధతికై ముగ్ధుడనై ఇంత విపులంగా వ్రాయవలసి వచ్చింది. వారిరువురూ ఐశ్వర్య హోదాను కూడా మరిచిపోయారు. ఇటువంటి ఆప్యాంతరంగులు ఈ నవీన యుగంలో ఉన్నందుకూ మంగళాచరణ ఆశీస్సులు.

## సీతాకళ్యాణ వైభోగమే ప్రణవికృష్ణ కళ్యాణం పరమానందమే. 'గోపురం' ఎత్తు మనసుతో 'వివేక్'వంత విజయులు వియ్యమందారు!



**కొండంత ఐశ్వర్యవంతులూ – కొండంత మనసులు కలవారూ వచ్చి దీవించారు.**

చి॥సౌ॥ ప్రణవి కృష్ణ చి॥ కోదండ విజయ్ కోమలాంగి కావడం పసుపు కుంకుమల సౌభాగ్యవల్లిలా భాసిల్లాలని హరికృష్ణ – కృష్ణకుమారి కోదండరామ – నళినీ జయంతి వియ్యపు నెయ్యింపులు వసుధ ఉన్నంతవరకూ వర్ధిల్లాలని, పుంసాయ మోహనుండు శ్రీరాముడు, ఈ కారోబ్జదళ లక్ష్మీమ్ సీతామ్ అంటూ సీతాదేవిను ప్రార్థిస్తూన్నాం.

# హిందూ మతం పడమట దిక్కుల్లో ప్రభవిస్తోంది!!

దైవభక్తీ, హిందూ దేశ సాంప్రదాయాలూ సంస్కృతి, పండుగలు, కళలూ అక్కడే కుసుమించి సౌరభిస్తున్నాయ్, పాకీస్థాన్ విడిపోయిన 1947 సం॥ములో మనం హిందూ స్థానంగా ఏర్పరచుకొంటే ఎంతో బాగుండేది. విభజనకు అంగీకరించక పోయినా బాగుండేది. కానీ మన సనాతన ధర్మంలోని ఔదార్యం, క్షమాగుణం, సమాసమానత్వం, సర్వమానవులూ ఒకటే అన్న సఖ్యభావం మనరెక్కల్ని విరిచి కట్టేసింది. అందరూ మనవాళ్ళే, అందరూ భారత పౌరులే అనుకున్న సత్యభావం, సహనం మనకు ఎదురుదెబ్బను తీసాయ్. అందరూ భారతీయులే అనుకున్న అతివిశ్వాసం మనల్ని మనకళ్ళతోనే పొడిచింది. అర్ధ కాశ్మీర్ ఆజాద్ కాశ్మీర్ కావడం, శేషించిన అర్ధాన్ని కూడా దోచేద్దామనే కుతంత్రమూ, భారతీయ ముసుగులో ఉన్న ముష్కరులు జరిపే రోజువారీ కయ్యాలు, రొచ్చుబాటూ మన పాలకుల్లో కపటివేషగాళ్ళుండడమూ ప్రమాదకరంగా పరిణమించింది. పౌరుల్లో క్రౌరులు దూరిపోయారు. హిందూ ధర్మ సంస్థలపై బడి దోచుకుంటున్నారు. హిందూ గురువులను ఏ విచారణలు లేకుండా జైళ్ళపాలు చేస్తున్నారు.

హిందూమతం ఒక విరాట్ విశాల త్రిమూర్తి స్వరూపమైన అశ్వత్థ వృక్షం. కాల వేగోధృతిలో, చరిత్ర గతిలో, అసంఖ్యాకమైన అనాగరిక పాశవిక సముదాయాలు ఈ వృక్షాన్ని నరికేశాయి. ఎన్నో మతాల జంఝామారుతాలు కూకటివేళ్ళతో సహా పెకిలించేశాయి. అయినా, మోదు వారిని తొర్రల

(తరువాయి 26వ పేజీలో)



## హిందూ మతమును కాషాయరంగు అనవద్దు...

***హిందూ మతం కేవలం విశ్వాసం కాదు. అనేకానేక తర్కాల వల్ల సంతరించుకున్న తార్కిక జ్ఞానానికీ ఆత్మైక సత్యానికీ, అనుభవైక వేద్యమైన,. అప్రత్యాఖ్యామైన దివ్యానుభవానికి ప్రతీక. ప్రపంచ చరిత్రలో, మానవ మేధకీ, హృదయానికీ పరిపూర్ణమైన స్వేచ్ఛని ప్రసాదించి వ్యక్తి ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసి తనలోని శక్తియుక్తులని గ్రహించేలా చేయగలిగింది ఒక్క హిందూమతమే.***

***హిందూ మతం అంటే స్వేచ్ఛ. భగవంతుడి గురించి స్వచ్ఛందంగా ఆలోచించ గలిగిన సమర్థత, ఆధ్యాత్మికతని ఆకళించుకుని అందులో విలీనం కావడానికి మానవుడు ఏ అవధులూ, హద్దులూ లేకుండా అంతరిక్షంలో కూడా పయనించేలా చేయగలిగింది హిందూమతమే అన్నారు.***

**– డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ**

నేను నా ప్రజలకి చేయవలసిన సేవలూ, వాళ్ల విషయంలో నిర్వహించాల్సిన విధ్యుక్త ధర్మాలూ ఈ జన్మలో పూర్తి చేయలేకపోతే మళ్లీ 200 సార్లు జన్మ ఎత్తడానికి కూడా నేను సంసిద్ధమే! నాలో దేశభక్తి అంతరించుకుపోయింది. అన్ని హర్షించుకుపోయాయి. ఇప్పుడు నేను లీనమయ్యేది కేవలం ఆ జగన్మాతలోనే.

**మతమంటే మనిషిలో దైవత్వాన్ని రూపొందించగలగాలి!**

**మతం మూర్ఖుడిని మనిషిగానూ, మనిషిని దేవుడిగానూ తీర్చిదిద్దాలి.**

ఏ వ్యక్తి అయినా రాజకీయంగా, సామాజికంగా స్వాతంత్ర్యం సంతరించుకోవచ్చు. కాని, తన వాంఛలకి బానిసైతే స్థిరమైన సంతోషం,స్వతంత్రత లభించవు.

ప్రతి జీవిలోనూ పరమాత్ముడు వున్నాడు. అంతకు మించిన పరమాత్మ వేరే ఎక్కడా లేదు. అంచేతే, "జీవుల సేవే దేవుడి సేవ" అనుకుంటాను.

అందరిలోని భగవంతుడిని ఆరాధించే గుణం ఉండాలి. ఆకలితో వున్న కుక్కకి పట్టెడన్నం పెట్టి ఆ కుక్కలో కూడా భగవంతుడిని చూడగలిగిననాడు మీకు సర్వే సర్వత్రా దేవుడే గోచరిస్తాడు. నిస్వార్థమే దేవుడు. ఏ వ్యక్తయినా సింహాసనం అధిష్టించవచ్చు. భగవంతుణ్ణి తనలో నివసింపచేయవచ్చు. తనలో అహంభావం పురివిప్పకుండా చూసుకుంటే అన్నిటా, అంతటా దేవుడినే చూడొచ్చు. "అన్ని మతాలు ప్రబోధించేది దేవుడొక్కడే" అన్న సత్యం అందరూ ఆకళించుకునేలా చేయాలి. ఈ ప్రపంచానికి వెలుతురిచ్చేది ఎవరూ?

భూమిని దేవతగా ఆరాధించాలి. సత్యం, స్వచ్ఛతా, నిస్వార్థం అనే గుణాలు వున్న వ్యక్తిని ఈ ప్రపంచంలో ఏ శక్తి అణచి వేయలేదు. సత్యం కోసం ఏదైనా త్యాగం చేయాలి. కాని, దేనికోసమో సత్యాన్ని బలి చేయ రాదు.

ఆత్మ విశ్లేషణ, ఆత్మ సంశోధన, ఆత్మ పరిశోధన అనేవే మానవుడి పరమధర్మాలు. 'నేను' అనేది లేదనీ, అంతా 'నువ్వే'ననీ అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. కేవలం తన విధ్యుక్త ధర్మాలని సక్రమంగా నిర్వహించడం వల్లే ఏ వ్యక్తయినా, గౌతమ బుద్ధుడు కావచ్చు.

**అన్నింటిని విస్తరించేది జీవనం. అన్నింటిని సంకోచింపజేసేది మరణం. ప్రేమ వ్యాకోచం, స్వార్థం సంకోచం. కనుక ప్రేమే జీవన సిద్ధాంతమైపోవాలి.**

ప్రేమించేవాడు అమరుడవుతాడు. స్వార్థపరుడు జీవచ్ఛవంలా మారిపోతాడు. కనుక, అవ్యాజంగా ప్రేమని ప్రేమ కోసమే ప్రేమించాలి. అది మీ జీవన ధర్మంగా మీ ఉచ్ఛ్వాస, నిశ్వాసాలలో నిండిపోవాలి.

మంచి ఉద్దేశ్యాలు, చిత్తశుద్ధి, అమేయమైన ప్రేమతో ఈ ప్రపంచాన్నే జయించ గలుగుతాము. ఏ జీవిలో ఈ గుణాలన్నీ సముజ్జ్వలంగా భాసిస్తాయో ఆ వ్యక్తి ఈ అంధకార బంధురమైన ప్రపంచంలో వెలుగు నింపగల ఉత్తమ వ్యక్తుల్నే. నీ మనసులోకి రానివ్వాలి. మస్తిష్కాలలోకి మంచి ఆలోచనలు ప్రవేశింపచేయాలి. మీ మస్తిష్కం, కండరాలూ, నరాలూ, శరీరంలోని ప్రతి భాగం పరమాత్ముడి కోసమే పరితపిస్తుంది. అదే, జీవన్ముక్తికీ, మోక్షానికీ దారితీస్తుంది అన్నారు.

**– స్వామి వివేకానంద**

స్వర సాహిత్యం సుస్వరం కోల్పోయింది!

## కోలు కోలో అంటూ హరిదాసు పెద్దింటికెళ్ళాడు!

హరిలో రంగా హరి అన్నాడో, లేదో ఆ ఇంట్లోని కిలో రూపాయి కిచ్చే రేషన్ బియ్యాన్ని బొళుక్కుమని హరిదాసు నెత్తినున్న గిన్నెలో పోసారు. ఏంటమ్మా! ఎప్పుడు పోయని కిలో బియ్యాన్ని పోసారు– అంటూ నివ్వెరపోయాడు. హరి నామస్మరణ చేసే నీకయినా ఆ బియ్యంలోని ముతకవాసనా పురుగులు పోతాయని పోసానురా! అయ్యగారు సంక్రాంతికి ఎవరొచ్చినా లేదనకుండా బస్తాలోని బియ్యం కిలో కిలో చొప్పున ధర్మం చేసేయమన్నారు! అంది ఆవిడ.

అమ్మా! కలో గంజో తిని మేమూ పిల్లలం బ్రతుకుతున్నాం. మాయింట్లోకిలాటి బియ్యం పోసి రోగాలు పాలు సేయకు తల్లీ– అంటూ 'అలో రంగా అరి' అంటూ పరుగు పరుగున వెళ్ళడం జూచి– పక్కనే ఉన్న పోకిరీ కుర్రాళ్ళు 'గొబ్బెమ్మల ఆకారంలో రాళ్ళు పోసి చుట్టూ తిరుగుతూ, చప్పట్లు చరుస్తూ–

**గొబ్బీయల్లో గొబ్బియల్లో**
**జనం సొమ్ము జెల్లకొట్టి కొట్టేయాలో**
**గనులన్నీ తవ్విపోసి మెక్కీయాలో**
**భూములన్నీ చుట్టబెట్టి నొక్కేయాలో**
**పథకాల వంకెట్టి పంచేయాలో**
**ఖజానా కాసులన్ని లాగేయాలో**
**ఎదురొస్తే ఎదురెట్టి ఏకేయాలో**
**సిగ్గూ శరము లేక ఊరేగాలో**
**గొబ్బీయలో గొబ్బీయలో**



(–ఎ.వి.హెచ్.ఎన్.శర్మకు కృతజ్ఞతతో)

–వెనక్కి తిరిగి ఆ పాట విని, అవెవరి గొంతులో తెలుసుకుని ఉడాయించాడు.

ఇంతలో అదృశ్యస్వరం– 'అయ్యో! హరిదాసూ భయపడకు. నేను గనుక అధికారంలోకి వస్తే నీ కష్టాలు తీరిపోతాయ్. ఇత్తడి గిన్నె బదులు బంగారు గిన్నెనే నెత్తిన పెట్టుకుని అడుక్కోవచ్చు అన్నాడు. ఆ మాటలను విన్నదాసు 'రంగరంగహరీ' చిడతలు వెనక్కి పెట్టుకుని పరుగే పరుగు. ●

(25వ పేజీ తరువాయిః)
లోంచీ, కూలిపోయిన కుడ్యాలలోంచీ, కిసలయిందే లవలీ నికుంజాలలా, హిందు మతం అంకురిస్తూనే వుంటుంది. మొలకలేసీ, మొగ్గలు తొడిగీ, పువ్వులై కాయలై, పళ్లై, భారతీయ సాంస్కృతిక జనజీవనవనిలో, నిత్యవసంతాలు వెల్లివిరుస్తూనే వుంటాయి. కారణం, హిందుమతం, ఏ కొద్దిమంది ప్రవక్తల అభిమతం కాదు. ప్రబోధకులు ప్రతిపాదించిన సిద్ధాంతాల రాద్ధాంతమూ కాదు. దంత వేదాంతాల ఉదంతమూ కాదు. కరడు గట్టిన మౌఢ్యాల వృత్తాంతామూ కాదు. అగ్రవర్ణాల, జాతుల సొంతమూ కాదు. రాచరికాలను సైతం తన గుప్పెట్లో పెట్టుకున్న మతాధిక్య వ్యవస్థకి హిందూ మతంలో చోటు లేదు. నిజానికి హిందూ మతం అనే పేరు ఆవిర్భవించి సహస్రాబ్దాలయింది. అనుశృతమైన, అనంతమైన, వేద సంస్కృతి, నాగరికతల మూలమైన ఆర్ష విజ్ఞాన ధర్మాల చెలమలలోంచి చివ్వున ఊరికి పైకెగసిన సజీవ, సారస్య, స్వారస్య సర్వజనుల సుఖైక జీవ రసధార హిందూమతం. ఆర్ష ధర్మజనితమైన హిందూమతమనే మహా తరువు ఏనాడూ ఎండిపోలేదు. ఎండిపోదు. ఈ అవిరళ చైతన్య ప్రవంతి ఎప్పుడూ యింకిపోదు.

ఆ సత్యం ఆకళించుకున్నాడు కనుకనే, గౌతమబుద్ధుడు సైతం ఆనాడు హిందు మతంలోని శిష్ట సంప్రదాయాలను నెలకొల్పి, బౌద్ధమత ప్రతిపాదకుడయ్యాడు. ఆ తరువాత, హిందూమతం భరతావనిలో లుప్తమైనా, నేల నాలుగు చెరుగులా వ్యాపించి, శ్రీలంక, బర్మా, జపాన్ వంటి దేశాలకి కూడా విస్తరించింది. హిందూ మత ప్రాశస్త్యం ఆకళించుకున్నాడు కనుకనే, అక్బర్ చక్రవర్తి కూడా, హిందూ – ఇస్లాం మత సిద్ధాంతాలని మేళవించి, దీన్ – ఇల్లాహీ మతం ప్రతిపాదించాడు. ఆయన పరిపాలనా కాలంలో, హిందూ, మహమ్మదీయులలో సామరస్యం చోటుచేసుకుంది. అది శంకర భగవత్పాదులు కూడా అమలమైన అర్ష్య ధర్మాన్ని పునరుద్ధరించి అద్వైత, సిద్ధాంత ప్రతిపాదకులయ్యారు. బౌద్ధమైనా, జైనమైనా, సిక్కు మత మైనా, అద్వైతమైనా, విశిష్టాద్వైతమైనా, ద్వైతమైనా, ఆర్ష్య విజ్ఞాన సంభరితమైన హిందూ మత "మహా మహీరుహం శాఖోపశాఖలే". ఆయా మతాచారాల లోనూ, సంప్రదాయాలలోనూ హిందూ మత విధానాలు ప్రస్ఫుటంగా అగుపిస్తాయి. మొగల్ చక్రవర్తులూ, బ్రిటిష్ సామ్రాజ్యవాదులూ, ఆర్థికంగా భారతీయులని అణచివేయగలిగారేమో కాని, హిందూ మతాన్ని మాత్రం కూలతోయలేకపోయారు. ఎవరో కొందరు, మహ్మద్ ఘోరీ, గజనీలాంటి మతమౌఢ్యులు భారతీయ దేవాలయాలనీ, శిల్ప సంపదలనీ ముక్కచెక్కలు చేసినా, ముమ్మూర్తులతో, ముక్కోటి దేవతలతో మానవుడి మనోమయ, జ్ఞానమయ, ఆనందమయ కోశాలని ఆవరించిన హిందూమతం చెక్కుచెదరలేదు. ప్రాక్ పశ్చిమ దేశాలు కూడా, హిందూమత ప్రాశస్త్యాన్ని ఆకళించుకున్నాయి. స్వామి వివేకానంద, ప్రభూపాద (శివానంద), దయానంద సరస్వతీ, పరమహంస యోగానంద లాంటి మహాయోగిపుంగవుల ప్రపంచ పర్యటనలతో, హిందూ మత వైశిష్ట్యం విశ్వమంతా వెల్లివిరిసింది. చివరికి, అంత సౌందర్యాన్ని లేశమైనా పట్టించుకోని హాలీవుడ్ సెలబ్రిటీస్ సైతం హిందూమతం అవలంబించడానికి ముందుకు రావడం, భారతీయ సంస్కృతినీ, సంప్రదాయాలనీ అనుకరించడానికీ, అనుసరించడానికీ తహతహలాడడం చూస్తూనే ఉన్నాం. హిందూమతం గురించి వాళ్లకి సవ్యమైన, సక్రమమైన, సమగ్రమైన అవగాహన కల్పించడం మన కర్తవ్యం ఇంకా ఉన్నది. జూలియస్ రాబర్ట్ లాంటి విశ్వవిఖ్యాత హాలీవుడ్ నటీమణులు కూడా హిందూమతం అవలంబించడానికి మనసా, వాచ, కర్మణ సంసిద్ధులవుతున్న తరుణమిది.

అఖండ భరత ఖండంలో ప్రభవించిన ఒక సనాతన సంప్రదాయం. ఆ రోజుల్లో హిందూమతం, హిందూ మతాన్ని సనాతన ధర్మంగా అభివర్ణించారు. వేదోక్తమైన భక్తితత్వాన్నీ, శైవ వైష్ణవ సంప్రదాయాన్నీ, యోగ విన్యాసాలని కూడా అంతర్హితం చేసుకున్న వివిధ వర్ణార్ణవం హిందూమతం. మానవ జీవన దైనందిన కార్యక్రమాలని, నియతికృతంగా, నియమబద్ధంగా నిర్వచించిన అనర్ఘ ధర్మమే హిందూ ధర్మం.

క్రిస్టియానిటీ, ఇస్లాంల కన్నా హిందూమతం ప్రపంచంలోనే బహుళ జనాదరణ పొందిన మతం. ప్రజాస్వామ్య అలౌకిక సిద్ధాంతబద్ధమైన భారతదేశంలోనే దాదాపు ఒక మిలియన్ జనాభా హిందూమతానికే చెందుతారు.

చతుర్వేదోక్తమైన హిందూ ధర్మ గ్రంథాలని, శ్రుతి, స్మృతులుగా విభజించారు. ఇవన్నీ సైద్ధాంతిక, తాత్విక, పౌరాణిక ప్రాశస్త్యాల వివరాలని కూలంకషంగా అందిస్తాయి. గీతాచార్యుడు మహాభారతంలో అర్జునుడిని ప్రబోధించిన శ్రీమత్ భగవద్గీత, రామాయణంలో, ఇక్ష్వాకు కుల గురువు వశిష్టుడు, శ్రీరాముడికి బోధించిన వశిష్ట గీత, చతుర్వేద, వేదాంగాల, ఉపనిషత్తుల, అష్టాదశ పురాణాల సారమే హిందూమతం. వివిధ విశ్వాసాల, ఆలోచనల, అభిమతాల త్రివేణీ సంగమం. కర్మ సిద్ధాంతానికి మార్గదర్శనం కల్గించింది.

ఇలా, నిర్వచించిన కర్మ నిరంతరం, నిరంతరాయంగా, ఈ విశ్వ సృష్టి స్థితి లయలలో కొనసాగుతూనే వుంటుంది. ●

## మలేషియా తెలుగు మిత్రులకు కృతజ్ఞతలు!

*ప్రపంచ తెలుగు మహాసభల సందర్భముగా తిరుపతి వెడుతూ ఎందరో ప్రముఖాంధ్ర అభిమానులు గోటేటి శ్రీరామారావు గృహానికి భార్యా బిడ్డలతో వచ్చి అభినందనలంద చేస్తూ* ***నిండుగ నూరేండ్లూ నీవు వర్ధిల్లాలి.*** *మలేషియాకు వచ్చి మా గృహాల్లో నీవు పాదం పెట్టాలి. ఆతిథ్యం తీసుకోవాలి.*

*7–3–2013న నీ 81వ పుట్టినరోజును మా మలేషియాలో చేస్తాం. ముందుగానే నీవు రావాలి. మా తెలుగువాళ్ళ పుణ్యరాశివి. నీ పేరును కలకాలం మా గుండెల్లో దాచుకుంటాం – అనీ అనగానే నా గుండెలో ఉన్న బాధంతా మాయమైపోయింది. ఏంఇచ్చి వారి ఋణం తీర్చుకోగలను – వారందరూ ఆచంద్రతారార్కమూ ఆరోగ్య సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నాను.*

**– గోటేటి శ్రీరామారావు**